'ఎమ్మార్ఐఈటీ' అధ్యాపకులకు అవార్డులు



మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్ఐఈటీ కళాశాల అధ్యాపకులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు దక్కాయి. కళాశాలకు చెందిన అధ్యాపకులు శ్రీనివాస్‌, హనుమాజీ, రెహమాన్‌పాషాలకు డీవిలిట్‌ టెక్నాలజీస్‌ సంస్థ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను ప్రదానం చేసి సత్కరించింది.

మురుగు సమస్యను పరిష్కరించండి



మురుగు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాలనీవాసులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి, నిజాం షుగర్స్‌ కాలనీలో డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ సమస్య ఉన్న ప్రాంతాన్ని కాలనీవాసులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రైనేజీ వ్యవస్థకు ఔట్‌లెట్‌ లేకపోవడంతో మురుగు నిల్వ ఉండటం వల్ల నానా అవస్థలు పడుతున్నామన్నారు. ఇళ్ల పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి మురుగు చేరడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. దుర్వాసన వెదజల్లడంతో నిత్యం తలుపులు, కిటికీలు వేసుకునే ఉండాల్సి వస్తోందన్నారు. అన్ని రకాల పన్నులు, ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

హోటల్‌ మేనేజ్‌మెంట్‌కు ప్రత్యేక గుర్తింపు

అల్వాల్‌: పారిశ్రామికరంగంలో హోటల్‌ మేనేజ్‌మెంట్‌ విభాగం ప్రత్యేక స్థానాన్ని పొందుతుందని విద్యార్థులు అధికశాతం హోటల్‌ రంగం వైపు మొగ్గు చూపుతున్నారని, నారాయణ హోటల్‌ మేనేజ్‌మెంట్‌ డైరెక్టర్‌ రామానుజన్‌ అన్నారు. శనివారం అల్వాల్‌లోని నారాయణ హోటల్‌ మేనేజ్‌మెంట్‌ కళాశాలలో జరిగిన ఫ్లోరల్‌ ఫ్రెంజీ వార్షిక గ్రాండ్‌ ఫ్లవర్‌ అరెంజ్‌మెంట్‌ ఫెస్ట్‌లో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు మార్గదర్శకాలు, సూచనలు చేశారు. హౌస్‌కీపింగ్‌ అనేది హోటల్‌ విభాగంలో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోగా వారిని అభినందించారు. ప్రిన్సిపాల్‌ షీలా తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్‌ స్టేషన్‌ ఏర్పాటుకు సహకరించండి



ఎంపీ ఈటలతో కార్పొరేటర్‌ శ్రవణ్‌, డీఆర్‌యూసీసీ సభ్యుడు నూర్‌

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లో ఎంఎంటీఎస్‌ స్టేషన్‌ ఏర్పాటుకు సహకరించాలని ఆనంద్‌బాగ్‌ రైల్వేస్టేషన్‌ సాధన సమితి సభ్యులు స్థానిక కార్పొరేటర్‌ శ్రవణ్‌, డీఆర్‌యూసీసీ సభ్యుడు నూర్‌లతో కలిసి శనివారం ఎంపీ ఈటల రాజేందర్‌కు విజ్ఞప్తి చేశారు. వారు మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్‌ పరిధిలో పలుచోట్ల ఆర్‌యూబీ, ఆర్‌ఓబీల నిర్మాణం కావడానికి ఎంపీ చొరవ అభినందనీయమన్నారు. ఆనంద్‌బాగ్‌ ఎంఎంటీఎస్‌ స్టేషన్‌ ప్లాట్‌ఫామ్‌ నిర్మాణానికి రూ. 5 లక్షలు అందజేస్తానని సాధన సమితి సభ్యులు శాస్త్రి, నాగేశ్వరరావులకు హామీ ఇచ్చారు. ఆనంద్‌బాగ్‌ స్టేషన్‌ నిర్మాణంతో మౌలాలి, చర్లపల్లి నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు !

అధ్వానంగా రైల్వే వంతెన- ఏదులాబాద్‌ ప్రధాన రహదారి

- మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికుల విజ్ఞప్తి
- పట్టించుకోని సంబంధిత అధికారులు



మాధవరెడ్డి వంతెన వైపు వెళ్లే రహదారి

ఘట్‌కేసర్‌: పట్టణంలోని మాధవరెడ్డి రైల్వే వంతెన వైపు నుంచి ఏదులాబాద్‌ మెయిన్‌రోడ్డుకు వెళ్లే రహదారి పరిస్థితి దారుణంగా తయారైంది. ఏళ్లుగా ఇదే తంతు కొనసాగుతుండడంతో ప్రయాణికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

కుంటలను తలపిస్తున్న రహదారి..

పట్టణంలో వంతెన పనుల కారణంగా వాహనాల రాకపోకలకు మాధవరెడ్డి వంతెన వైపు నుంచి ఏదులాబాద్‌ అండర్‌పాస్‌ రోడ్డు మీదుగా ప్రస్తుతం రాకపోకలు సాగుతున్నాయి. నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుండటంతో రోడ్డుపై అడుగు గుంతలు ఏర్పడి కుంటను తలపిస్తున్నాయి. వరద నీటిలో రోడ్డు మరింత అధ్వానంగా మారుతోంది.



అండర్‌పాస్‌కు వెళ్లే రోడ్డు ఇలా..

మట్టి పోసినా ప్రయోజనం శూన్యం..

గుంతల్లో మట్టి పోసినా వాహనాల రాకపోకలు అధికం కావడంతో బురదమయంగా మారి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏమరుపాటున ప్రయాణిస్తే వాహనం అదుపు తప్పి, బురదలో పడే ప్రమాదముంది. ఇంత జరుగుతున్నా.. అధికారులెవరూ..? పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బురదలోనే ప్రయాణం...

పట్టణంలోకి వెళ్లే వీధుల్లో ట్రాఫిక్‌ సమస్య తలెత్తుతోందని వాహనదారులు రైల్వే వంతెన నుంచి లోపలికి నేరుగా వెళ్లకుండా వంతెన దిగగానే ఎడమ వైపు తిరిగి ఏదులాబాద్‌ అండర్‌ పాస్‌రోడ్డు వైపు ప్రయాణిస్తున్నారు. స్థానిక వాహనాలే కాకుండా విజయవాడ జాతీయ రహదారి అబ్దుల్లాపూర్‌ మెట్టు వైపు నుంచి కీసర, బోగారం, శామీర్‌పేట్‌, రాజీవ్‌ రహదారి కరీంనగర్‌, సిద్దిపేట్‌ వైపు వెళ్లే వాహనాలు ఇదే రోడ్డులో ప్రయాణిస్తుంటారు. రాజీవ్‌రహదారి, కీసర వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లాలన్న ఏదులాబాద్‌, ఎంకిర్యాల్‌కు వెళ్లాలన్న ఈ రోడ్డును దాటాల్సిందే. అధికారులు, నాయకుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ఇలా తయారైందని అధికారులకు స్థానికులు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు..



రోడ్డు సమస్యపై చాలా ఏళ్లుగా ఇదే తంతు కొనసాగుతున్నా.. ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. సమస్య తీవ్రత పెరిగినప్పుడు పనులు చేపట్టి వదిలేస్తున్నారు. రోడ్డు సమస్యను అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు.

– రవికాంత్‌రెడ్డి, కొండాపూర్‌

శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలి



గుంతలు ఏర్పడగానే మట్టి పోసి చేతులు దులుపుకుంటున్నారు. అనంతరం సమస్యను పట్టించుకోవడం లేదు. తాత్కాలిక పనులు కాకుండా రోడ్డుకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి.

– మల్లేష్‌ముదిరాజ్‌, ఏదులాబాద్‌

నరకం అనుభవిస్తున్నాం



పట్టణం నుంచి కీసర వైపు వెళ్లాలంటే నరకం అనుభవిస్తున్నాం. అడుగులోతు గుంతలతో వాహనాలు దెబ్బతింటున్నాయి. ప్రమాదాలు జరిగి గాయాలపాలవుతున్నాం. దీనిపై అధికారులు చొరవ తీసుకోవాలి.

– రమేష్‌, స్థానికుడు

స్థానిక సమస్యలపై ఆల్‌ పార్టీ జేఏసీ సమావేశం



కీసర: నాగారం మున్సిపాలిటీ జాయింట్‌ యాక్షన్‌ కమిటీ (జేఏసీ) అధ్యక్షుడు జయకుమార్‌, ఉపాధ్యక్షులు జితేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంద్ర కమలాకర్‌పటేల్‌ అధ్యక్షతన శనివారం నాగారం మున్సిపాలిటీ సమస్యలపై ఆల్‌ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగారం మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో ముందుకుసాగాలని, సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీలు కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నేతలు సాయినాథ్‌గౌడ్‌, శ్రీనివాస్‌, బీజేపీ మాజీ అధ్యక్షుడు కేశవరెడ్డి, టీడీపీ నేతలు జంగారెడ్డి, ఉమామహేశ్వర్‌గౌడ్‌, జనసమితి అధ్యక్షులు చిట్యాల శ్రీనివాస్‌రెడ్డి, ఇతర రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

కీసర: మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన కీసర పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కీసర అంకిరెడ్డిపల్లికి చెందిన నీలం కమలమ్మ (50), గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీనికి ఆర్థికఇబ్బందులు తోడవ్వడంతో ఆమె ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోక్‌ అదాలత్‌లో 639 కేసుల పరిష్కారం

మేడ్చల్‌: మేడ్చల్‌లోని న్యాయస్థానాల ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో 639 కేసులు పరిష్కారం అయ్యాయని మేడ్చల్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి తెలిపారు. 4 కోర్టుల పరిధిలో 297 క్రిమినల్‌ కేసులు, సివిల్‌ కేసులు 2, ఎన్‌ఐ యాక్ట్‌ 5, క్రిమినల్‌ అడ్మిషన్‌ కేసులు 350, సైబర్‌ క్రైమ్‌ 85, పీఎల్‌ బ్యాంకు 6, మొత్తం 639 కేసులు పరిష్కారమయ్యాయని హన్మంత్‌రెడ్డి వివరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

మేడ్చల్‌: అత్వెల్లిలోని సేయింట్‌ క్లారెట్‌ స్కూల్‌లో శనివారం ఉపాధ్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యజమానుల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాదినోత్సవాన్ని నిర్వహించారు. సమావేశంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈఓ శంకరయ్య, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యజమానుల కమిటీ సభ్యులు మంజుల ప్రకాష్‌, గిరిబాబు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయాన్ని మండల పరిషత్‌కు తరలించాలి

శామీర్‌పేట్‌: సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాన్ని మండల పరిషత్‌ కార్యాలయంలోకి మార్చాలని మాజీ ఎంపీపీ వల్లి సీతారాములుగౌడ్‌ అన్నారు. శనివారం శామీర్‌పేటలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం శామీర్‌పేట సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోందని, అరకొర వసతుల మధ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. శామీర్‌పేట్‌ మండల పరిషత్‌ కార్యాలయానికి సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయాన్ని తరలిస్తే వినియోగదారులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. పార్కింగ్‌తో పాటు షెట్టర్లు (మడిగెలు) ఉన్నాయని వాటిని వాడుకోవడంతో ప్రభుత్వానికి ఆదాయ మార్గాలు పెరుగుతాయని చెప్పారు. అధికారులు స్పందించి సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాన్ని మండల కార్యాలయం ఆవరణలోకి మార్చాలని ఆయన కోరారు.

వ్యక్తిగత నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు



ఘట్‌కేసర్‌: వ్యక్తిగత నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని మెగా, ఒమెగా విద్యాసంస్థల వైస్‌ చైర్మన్‌ కసిరెడ్డి మాలతీరెడ్డి అన్నారు. శనివారం ఏదులాబాద్‌ మెగా ఇంజినీరింగ్‌ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ ఆన్‌ ఇండియన్‌ నాలెడ్జ్‌ సిస్టమ్‌–2025 ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు నిత్యం సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, అది లేకుండా విజయం సాధించలేమన్నారు. మన లక్ష్యాలను చేరుకోవాలంటే కమ్యూనికేషన్‌ స్కిల్స్‌ పెంచుకోవాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు, తల్లితండ్రులు చూపిన మార్గంలో పయనించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. బ్రహత్‌ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి రామకృష్ణ, ప్రిన్సిపాల్‌ రామసుబ్రహ్మణ్యం, వైస్‌ ప్రిన్సిపాల్‌ సాయివెంకటకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

'మీ సేవ' ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

శామీర్‌పేట్‌: 'మీ సేవ' ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి తెలంగాణ మీసేవ ఆపరేటర్స్‌ అసోసియేషన్‌ ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర అధ్యక్షుడు జీవన్‌ప్రసాద్‌ అన్నారు. శనివారం తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట్‌లోని ఓ హోటల్‌లో మీసేవా రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2017లో మాత్రమే చివరిసారిగా మీసేవ కమిషన్‌ పెంపు జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతిరోజు 8 నుంచి 12 గంటల వరకు శ్రమిస్తూ.. ఆపరేటర్లు ప్రభుత్వ సేవలను నేరుగా ప్రజలకు అందిస్తున్నారని, తీరికలేని పరిస్థితుల వల్ల అనేక ఆరోగ్యసమస్యలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మీసేవ కుటుంబాల సంక్షేమానికి ముందుకొచ్చి మద్దతు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌, కోశాధికారి శ్రీకాంత్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ అశ్విన్‌గౌడ్‌, జగదీశ్వర్‌, లక్ష్మీనారాయణ, పలు జిల్లాల మీసేవ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ఘట్‌కేసర్‌: పర్యావరణ సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ జ్యోతి అన్నారు. మున్సిపాలిటీలోని అంకుషాపూర్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల్‌ బుద్వేల్‌ డిగ్రీ మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ వాలంటీర్లు స్థానిక ప్రాథమిక, జెడ్పీ విద్యార్థులతో కలిసి శనివారం మొక్కలు నాటారు. స్థానికులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్‌ క్యాంపులో భాగంగా గ్రామంలో రోజుకో అంశంలో స్థానికులకు అవగాహన కల్పిస్తామన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



కీసర: కీసరలో స్నేహ మహిళ సొసైటీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కొత్తగా పైపులైన్‌ వేయడం జరుగుతుందని దమ్మాయిగూడ మున్సిపల్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ముప్పు రామారావు అన్నారు. శనివారం కాలనీలో రూ.2 లక్షల సీఎస్‌ఎఫ్‌ నిధుల కింద తాగునీటి పైపులైన్‌ పనులను ప్రారంభించారు. కాంగ్రెస్‌ నేతలు కృష్ణయాదవ్‌, రామిడి విజయరెడ్డి, మాజీ ఎంపీటీసీ బిల్డర్‌ రమేష్‌గుప్తా, నాయకులు వెంకటేష్‌, తటాకం అభిలాష్‌, మల్లేష్‌, ధర్మేందర్‌, పన్నాల బుచ్చిరెడ్డి, కీసర గ్రామశాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్‌, నేతలు కృష్ణారెడ్డి తదితరులున్నారు.

యజ్ఞ మహోత్సవానికి ఆహ్వానం

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ విరాట్‌ విశ్వబ్రాహ్మణ సంఘం జేఏసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ పార్టీ మేడ్చల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌, ఆరాధ్య ఫౌండేషన్‌ చైర్మన్‌ వాణిఖింత్‌రాజ్‌ను కలిశారు. సెప్టెంబర్‌ 17న జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ కమ్యూనిటీహాల్‌ వద్ద జరిగే యజ్ఞమహోత్సవానికి ఆహ్వానించారు. తాటికొండ శ్రీరాములుచారి, రమేష్‌, దయాకర్‌, సోమాచారి, కేకే.చారి, నర్సింహ, గాలయ్య, యాకచారి, వెంకటరమణ, నగేష్‌, రమేష్‌బాబు, రామాచారి, నవీన్‌, వెంకటాచారి, సత్యం పాల్గొన్నారు.



వేడుకగా హిందీ భాషా దినోత్సవం



కీసర: రాంపల్లి జూబ్లీహిల్స్‌ స్కూల్‌లో హిందీభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్‌ ప్రిన్సిపాల్‌ ఎం.సంతోష్‌కుమార్‌ మాట్లాడుతూ.. 1949వ సంవత్సరం సెప్టెంబర్‌ 14న భారత రాజ్యాంగం చేత అధికారికంగా గుర్తించడిన భాష హిందీ దీనిని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్‌ 14న హిందీభాషా దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటామననారు. హిందీ భాష ప్రాధాన్యతను వివరిస్తూ ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే భాషలలో హిందీ రెండో స్థానంలో ఉందన్నారు. హిందీభాష విశిష్టతను తెలియజేసేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. హెచ్‌ఎం, సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మార్‌సీఈలో 'క్రైసిస్‌ ఆన్‌ వీల్స్‌'

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ 'క్రైసిస్‌ ఆన్‌ వీల్స్‌' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సెమినార్‌లో సర్వజన ఫౌండేషన్‌ సీఈఓ జనార్దన్‌రెడ్డి పాల్గొని రోడ్డు ప్రమాదాలకు దారితీసే కారణాలు, వ్యక్తిగత బాధ్యత, ట్రాఫిక్‌ నిర్వహణ సమస్యలు, రోడ్డు భద్రతపై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్‌ సమస్య సంక్లిష్టాన్ని అధిగమించడానికి అవసరమైన విధాన చర్యలపై వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్‌ అశోక్‌ వాస్తవ సమస్యలు, వాటి పరిష్కారాలపై వివరించారు.

పాత నాణేలకు రూ. కోట్లంటూ బురిడీ

- డబ్బులు ప్యాకింగ్‌ చేస్తున్నట్లు వీడియోలు
- నగదు దండుకున్న సైబర్‌ నేరగాళ్లు

మేడిపల్లి: పాత నాణేలతో కోట్లాది రూపాయలు వస్తాయనే ఆశతో సైబర్‌ నేరగాళ్ల వలలో చిక్కిన సంఘటన మేడిపల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మేడిపల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని గాయత్రి నగర్‌లో నివసించే హరిప్రసాద్‌(36) రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి. తండ్రి లక్ష్మణ్‌రావు టైలర్‌గా పనిచేస్తున్నాడు. వీరి వద్ద పాత నాణేలు ఉన్నాయి. దీంతో వారికి తెలిసిన బంధువులు పాత నాణేలకు పెద్దమొత్తంలో డబ్బులు వస్తాయని చెప్పడంతో తండ్రీకొడుకులు నెట్‌లో సెర్చ్‌ చేశారు. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తితో కాంటాక్టు అయ్యారు. వీరి వద్ద ఉన్న పాత నాణేల ఫొటోలను తీసి పంపగా సైబర్‌ నేరగాళ్లు మీ పాత నాణేలకు మొత్తం రూ. 2 కోట్ల 35 లక్షల 25 వేలు వస్తాయని నమ్మబలికారు. వీరికి ఆన్‌లైన్‌ వీడియోలో డబ్బు కట్టలను ప్యాక్‌ చేస్తున్న వీడియోను పంపించారు. అనంతరం ఫోన్‌ చేసి శంషాబాద్‌ ఎయిర్‌ పోర్టులోకి మీ డబ్బులు వచ్చాయని... ఆ డబ్బులకు జీఎస్టీ కట్టాలని బాధితుడి నుంచి రూ. 17,500లను ఆన్‌లైన్‌ ద్వారా తీసుకున్నారు నేరగాళ్లు. తరువాత వెంటనే సెల్‌ ఫోన్‌ను స్విచ్‌ ఆఫ్‌ చేశారు. దీంతో బాధితులు పలు మార్లు ఫోన్‌ చేయగా స్విచ్‌ ఆఫ్‌ రావడంతో మోసపోయామని గ్రహించి మేడిపల్లి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ గోవిందరెడ్డి తెలిపారు.

వ్యసనాలకు బానిసై చోరీ బాట..

- చైన్‌ స్నాచింగ్‌ వీడియోలు చూసి.. నేరాలకు పాల్పడిన వైనం
- ఇద్దరు నిందితుల రిమాండ్‌
- నిందితుల్లో ఒకరు ఇంజినీరింగ్‌ విద్యార్థి

ఘట్‌కేసర్‌: వ్యసనాలకు బానిసై ఓ ఇంజినీరింగ్‌ విద్యార్థి చోరీ బాటపట్టాడు. యూట్యూబ్‌లో చైన్‌ స్నాచింగ్‌ వీడియోలు చేసి ప్రేరణ పొందాడు. స్నేహితుడితో కలిసి పొలంలో పనిచేస్తున్న వృద్ధురాలి మెడలోనుంచి పుస్తెలతాడును ఎత్తుకెళ్లాడు. ఈ చోరీని ఛాలెంజ్‌గా తీసుకున్న ఘట్‌కేసర్‌ పోలీసులు 48 గంటల్లోనే ఛేదించి ఇద్దరు నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించారు. క్రైం ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. అంకుషాపూర్‌కు చెందిన అర్థ కాంతమ్మ వ్యవసాయ పొలంలో పనిచేస్తుండగా గుర్తు తెలియని దుండగుడు 4 తులాల బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఏసీపీ చక్రపాణి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్‌ బాలస్వామి, క్రైం ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ బృందాలుగా ఏర్పడి దుండగుడి కోసం గాలించారు. శుక్రవారం ఘనాపూర్‌లో చోరీ కోసం వచ్చి పోలీసులకు చిక్కారు.

బాల్య స్నేహితుడితో కలిసి...

జనగామ జిల్లా లింగాల ఘనాపూర్‌, నేరుట్లకు చెందిన కేవిడ్‌ గణేష్‌(22) దివ్యనగర్‌లోని ఓ ఇంజినీరింగ్‌ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుకుంటూ అన్నోజిగూడలో ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన బాల్య స్నేహితుడు కూలీ పనిచేసే రాగుల లక్ష్మణ్‌ (22)తో కలిసి వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలన్న దురాశతో చోరీ బాట పట్టాడు.

యూట్యూబ్‌లో చైన్‌ స్నాచింగ్‌ వీడియోలు చూసి...

స్నేహితులిద్దరూ కలిసి యూట్యూబ్‌లో చైన్‌స్నాచింగ్‌ వీడియోలు చూసి నేర్చుకున్నారు. ఈనెల 9న కాంతమ్మ మెడలోని పుస్తెలతాడు అపహరించి జనగామలోని ముత్తూట్‌ ఫైనాన్స్‌లో కుదువబెట్టి రూ.2.25 లక్షలు తీసుకున్నాడు. ఇద్దరు డబ్బులు పంచుకోగా.. గణేష్‌ ఐఫోన్‌ కొనుగోలు చేశాడు. చోరీకి వాడిన బైక్‌, ఐఫోన్‌, ముత్తూట్‌ ఫైనాన్స్‌ రిసిప్టలను పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను శనివారం రిమాండ్‌ తరలించారు.



నిందితులతో ఇన్‌స్పెక్టర్లు బాలస్వామి, శ్రీనివాస్‌, సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ హీనా

మాధవరం సత్యనారాయణకు పరామర్శ

కీసర: బీజేపీ మాజీ జాతీయ కౌన్సిల్‌ సభ్యులు నాగారం వాసి మాధవరం సత్యనారాయణను హరియాణా మాజీ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. ఈ మేరకు శనివారం ఉదయం నాగారం సత్యనారాయణ కాలనీలో నివాసం ఉంటున్న సత్యనారాయణ ఇంటికి వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలను బీజేపీ నేతలు జిల్లాల తిరుమల్‌రెడ్డి, శ్యాంసుందర్‌శర్మ ,కందాడి సత్తిరెడ్డి, మునిగంటి సురేష్‌,, తదితరులు బండారు దాత్తాత్రేయకు వివరించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్‌ ఎస్‌. మల్లారెడ్డి, ఉప్పల్‌ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌, నాగారం మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి ఉన్నారు. శ్యాంసుందర్‌ శర్మ నివాసంలో బీజేపీ నేతలతో కలిసి దత్తాత్రేయ భోజనం చేశారు. బీజేపీ నేతలు బోడ శ్రీనివాస్‌రావు, రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాధవరం సత్యనారాయణతో మాజీ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ